

పిడుగు పడి పశువులు మృతి

ప్రజాశక్తి - అనంతగిరి: మండలలోని కురుస్తున్న వర్షాలతో పిడుగు పాటుకు 11 మూగ జీవాలు మృతి చెందాయి. మండలంలోని వేంగడ పంచాయతీ డొంకపుట్టు గ్రామానికి చెందిన సివేరి కళ్యాణ్, సూరే. రఘరం, శివేరి సత్యారావు, శివేరి బర్కాన్న, గుండన్న, గంగన్న, లంగుపర్తి పంచాయతీ పెండిలి రామన్నలకు చెందిన పశువులు పశు గ్రాసం కోసం కొండపైన మేత కోసం వెళ్లాయి. భారీ వర్షంతో పిడుగు పడంతో 11 దుక్కెటెద్దులు మృతి చెందాయి. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



మృతి చెందిన పశువులు

హుదూద్ బాధితుల గోడువినేదెవరో..?

- రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు లేక ఇక్కట్లు
- పూర్తి స్థాయిలో నిర్మించని గృహాలు
- పెరిబంధ మోడల్ కాలనీ వాసులను నూతన ప్రభుత్వమైనా కనికరించేనా..

హుదూద్ తుఫాన్ బాధిత గ్రామాల ప్రజల కోసం నిర్మించిన పిరిబంధ మోడల్ కాలనీలో కనీస సదుపాయాలు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో మగ్గుతున్న పరిస్థితి నెలకొంది దీంతో పాటు ఈ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. ఆ కాలనీ వాసులు ఇబ్బందులతోనే జీవనం సాగిస్తున్నారు. నూతన ప్రభుత్వంపై పరిష్కరించాలని కోరారు.



పిరిబందలో అసౌకర్యాలతో ఉన్న మోడల్ కాలనీ

ప్రజాశక్తి–అరకులోయరూరల్: అరకులోయ మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిధిలోని గ్రామాలైన బోయగూడ, పైబోయిగూడ, పిరిబంద గ్రామాలు కొండచరియలకు దగ్గరలో ఉన్నాయి. 2014 ఏడాదిలో వచ్చిన హుదూద్ తుపాను ధాటికి ఈ గ్రామాలకు సమీపాన ఉన్న కొండ చరియలు విరిగి పడ్డాయి. దీంతో, అప్పట్లో ఈ గ్రామాల గిరిజనులకు పెను ప్రమాదం తప్పింది. దీని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం 2014 సంవత్సరంలో 109 మందికి మోడల్ కాలనీ మంజూరు చేసింది. ఈ కాలనీ మంజూరు చేసి పదేళ్లు అయినప్పటికీ నేటికీ కాలనీ నిర్మాణ పనులు పూర్తి చేయ లేదు. కొన్ని ఇల్లులు బేస్మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. పనులు పూర్తి చేయకుండానే లాటరీ విధానంలో బాధిత గిరిజనులకు ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ కాలనీలో పలు కుటుంబాలు నివశిస్తున్నాయి. వాటర్ ట్యాంకు నిర్మించి కుళాయిలకు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో, ట్యాంకు వద్దకు వెళ్లిని నీటిని తెచ్చుకుం టున్నారు. కాలనీలో కూడా తుప్పలు పెరిగి పోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. దీంతో, కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. డ్రెయినేజీ, రోడ్లు అసలు నిర్మించ లేదు. గత్యంతరం లేక కొంతమంది సొంత డబ్బులతో ఇంటి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో బయటకు వచ్చేందుకు కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. నూతన ప్రభుత్వమైనా స్పందించి మోడల్ కాలనిలో సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న కాలనీలోని గృహాలు

సమస్యలను పట్టించుకోలేదు

మోడల్ కాలనీలో నిర్మాణం పూర్తి చేసి విద్యుత్, డ్రైనేజ్, తాగునీరు వంటి సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం పట్టించుకోలేదు. తమ సొంత డబ్బులతో ఖర్చు పెట్టి పనులు చేసుకుని ఇంట్లో దిగాము. తక్షణమే ప్రభుత్వం స్పందించి మోడల్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలి.



మజ్జి నర్సింగ్
పిరిబంద కాలనీవాసి

హిందీ పండిట్, భాషా వాలంటీర్ల నియామకాల్లో

గిరిజన అభ్యర్థులకు అన్యాయం సరికాదు : గిరిజన సంఘం

ప్రజాశక్తి–మారేడుమిల్లి : ప్రభుత్వం చేపట్టిన హిందీ పండిట్, భాషా వాలంటీర్ల నియామకాల్లో గిరిజన అభ్యర్థులకు అన్యాయం చేయడం సరికాదని ఏపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానికంగా గిరిజన అభ్యర్థులు బిఈడి వంటి ఉన్నతమైన కోర్సులు చేసి, హిందీ పండిట్ కోర్సుల్లో ప్రావీణ్యం సంపాధించి, ఇవాళ కాపోతే రేపైనా భాషా వాలంటీర్లుగా తమకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని గిరిజన నిరుద్యోగ యువత ఎదురు చూస్తుందని తెలిపారు. వారిని మోసగించే పద్ధతిలో ప్రభుత్వం హిందీ పండిట్ నియామకాలు ఇతర రాష్ట్రాల అభ్యర్థులతో చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిఓ 3కు చట్టబద్దత కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చినా టిడిపి, ఇప్పుడెందుకు భాషా వాలంటీర్ల నియామకాలు ఇతర రాష్ట్రాల అభ్యర్థులతో చేపట్టి స్థానిక గిరిజన అభ్యర్థులకు అన్యాయం చేస్తుందని పేర్కొన్నారు. దీనిపై గిరిజన యువత ఆలోచించుకొని పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలల్లో ఈ నియామకాలు ప్రభుత్వం చేపట్టినట్లు ప్రచారం జరుగుతుందని, ఇదే గనక జరిగితే ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాల కోసం ఎదురు చేస్తున్న యువత ఆశలు గాల్లో కలిసినట్లేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి స్థానిక అభ్యర్థులతో భాషా వాలంటీర్ల నియామకం చేపట్టాలని సిరిమల్లి రెడ్డి డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బుజ్జిబాబు

సీలేరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను

పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలి

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను 10వ తరగతి వరకు అప్ గ్రేడ్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపరంగా బుజ్జిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సమస్యల పట్ల అధికారులు చిత్త శుద్ధితో వ్యవహరించాలన్నారు. సీలేరులో బాలిక ఆశ్రమం పాఠశాలలో 9వ తరగతి వరకే ఉండడంతో పదో తరగతి చదవడానికి గిరిజన విద్యార్థినులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. 9వ తరగతి వరకు అదే పాఠశాలలో చదివి పదో తరగతి వేరే దగ్గర చదవాలంటే విద్యార్థులకు సీట్లు కొరత, ఇతర సమస్యలు ఎదురవుతున్నారని తెలిపారు. బాలికల పాఠశాలను పదవ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయమని ట్రైబల్ వెల్ఫేర్ డిడి, ఏటిడబ్ల్యూఓలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఐటీడీఏ పిఓ, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ పాఠశాలను 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొర్ర బాలయ్య, పాంగి బాబురావు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి–ముంచింగిపుట్టు: పాడేరు మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాల్లో ఆరేళ్ల బాలికను అత్యాచారం చేసిన నిందితుడిని ఏఎస్పి ధీరజ్, సీఐ, ఎస్ఐలు ప్రత్యేక చొరవతో పట్టుకోవడం పై మండల గిరిజన మహిళ సంఘం (ఐద్వా) అధ్యక్షురాలు సోనియా ఈశ్వరి, కార్యదర్శి సీసా విజయలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు ఈశ్వరి మాట్లాడుతూ, అత్యాచారం చేసిన దండుగుడుకి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఆరు సంవత్సరాల పాపను ఎత్తుకుపోయి అత్యాచారం చేడయం దుర్మార్గమన్నారు. ఇలాంటి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాలిక తల్లిదండ్రులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా మహిళా నేతలు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఐద్వా నేతలు



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

రోడ్డు పనులు ప్రారంభించాలి

- ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం తగదు
- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: ఫారెస్ట్ అధికారుల ఆటంకంతో నిలిచిన రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని స్థానిక సిపిఎం జడ్పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలు తెలుసుకునేందుకు మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధి కడరేవు గ్రామంలో సందర్శించారు. అనంతరం గ్రామస్తులు జడ్పిటిసితో మాట్లాడుతూ, రోడ్డు పనులు చేపట్టేందుకు గత రెండు సంవత్సరాల కాలంలో పనులను ప్రారంభించారని తెలిపారు. నిలిచిన పనులు తక్షణమే పున్నప్రార్రభించాలని ఆందోళన చేపట్టగా సంబంధిత ఉన్నత అధికారులు దిగొచ్చి జెసిబిలతో రోడ్డు పనులు చేపడుతుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారని తెలిపారు. అనంతరం గిరిజనులను ఉద్దేశించి గంగరాజు మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు కనెక్టివిటీ పాడేరు ప్రాజెక్ట్ కింద ట్రైబల్ వెల్ఫేర్ పథకం కింద కోటీ 70 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. 2021 -22 సంవత్సరంలో గుమ్మ పంచాయతీ పరిధి నిమ్మ ఊట నుండి సుమారు మూడు కిలోమీటర్లు దూరం పనులను చేపట్టిన పనులు వదిలి వేశారన్నారు. పనులు జరగకుండానే నిధులు సుమారు 65 లక్షల పైగా స్వాహా జరిగినట్లు ఆందోళన చేపట్టడంతో అధికారులు దిగొచ్చి అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం సమిద, నెరడి బంద మీదుగా కడరేవు, గోకులపాలెం, కొట్టెంగుడ మీదుగా కరిగోడ వరకు రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రారంభించగా ఫారెస్ట్ అధికారుల ఆటంకంతో నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వాలు మారినా అధికారుల పనితీరులో మార్పు రాలేదని మండిపడ్డారు. దీనిపై ఉమ్మడి జిల్లా పరిషత్ పాలకవర్గం సమావేశంలో లేవనెత్తి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పోరాటం చేసి నిధులు మంజూరు చేస్తుంటే అధికారులు ఆటంకం పరచడం ఎంత సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా రోడ్డు పనులకు అనుమతులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, గ్రామస్తులు రాపా రాజారావు, నందుల రాజారావు, సింహాద్రి, గోపాలరావు, సన్యాసి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి–నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు పురుగులు మందు సేవించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లోలి దుర్గారావు (18) తనకు బైక్ కొని ఇవ్వాలని ఇంట్లో తల్లిదండ్రులను అడిగాడు. బైక్ కొని ఇవ్వలేదని దుర్గారావు మనస్థాపం చెంది ఈనెల 15న పురుగుల మందు సేవించి, ఇంటికి వచ్చి పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. కుటుంబ సభ్యులు దుర్గారావును తుని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి శ్రీను తెలిపారు.

'విప్ప'తో ఆదివాసీలకు ఆదాయం

కాయలు సేకరిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి–చింతూరు

విప్ప చెట్టుకు గిరిజన ప్రాంతంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. విప్ప చెట్టు నుండి శీతాకాలంలో విప్ప పూలు, వేసవిలో విప్ప కాయలు సేకరించి ఆదివాసీలు ఆదాయం పొందుతున్నారు. విప్ప పూలను గిరిజనులు సీజన్లో సేకరించి ఎండలో ఆరబెట్టి నిల్వ ఉంచి, ఆపై వాటిని విక్రయిస్తారు. కొంత మంది సాంప్రదాయ విప్ప పూల సారాను తయారు చేసి వివాహాది శు భకార్యాలకు, దిన కార్యాలకు వచ్చే అతిథులకు మర్యాదపూర్వకంగా ఇస్తారు. అంతే కాకుండా విప్ప పూలు భద్రాద్రి రాముల వారి ప్రసాదంగా కూడా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. వేసవి కాలంలో గిరిజనులు విప్పకాయలు సేకరించి, వాటి నుండి పప్పును వేరు చేసి ఎండలో ఆరబెడతారు. బాగా ఎండిన విప్ప పప్పును బస్తాలలో నింపి మార్కెట్లో విక్రయిస్తారు. కిలో 50 రూపాయలు చొప్పున విప్ప పప్పును విక్రయించి గిరిజనులు ఆదాయం పొందుతున్నారు.



విప్ప కాయల నుండి పప్పును వేరు చేస్తున్న గిరిజనులు

విప్పతో పలు ఉపయోగాలు


ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానంలో, వివిధ పూజా కార్యక్రమాలలో విప్ప పప్పు నుండి తీసిన నూనెను వాడుతారు. ఈ ప్రాంత గిరిజనులు విప్ప నూనెను పిండి వంటలు, ఇతర వంటకాలలో విరివిగా ఉపయోగిస్తారు. విప్ప నూనె వాడటం వలన శరీరంలో ఉన్న చెడు కొవ్వు కరిగిస్తుంది. మధుమేహం వ్యాధి రాకుండా కాపాడుతుంది. సబ్బుల తయారీలో కూడా విప్పనూనె తీసిన తర్వాత మిగిలిపోయిన పిప్పిని వినియోగిస్తారు. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటుంది. పూర్వం గిరిజనులు విప్ప కాయలను సేకరించి వాటిని తొలిచి చక్క గానుగలో వేసి నూనె తీసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో యంత్రాల ద్వారా అధిక మొత్తంలో నూనె తీసి పలు రకాల ఔషధాల తయారీలో వినియోగిస్తున్నారు. ఇన్ని రకాల ఉపయోగాలు ఉన్న విప్ప చెట్ల నుండి ప్రతి ఏటా ఆదివాసీలకు ఆదాయం వస్తుంది. క్రమేపి అడవులను విచక్షణ రహితంగా నరికి వేయడంతో విప్ప చెట్లు అంతరిస్తున్నాయి. అడవులను కాపాడి మానవ మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి–రంపచోడవరం : ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి పోలవరం నిర్మాణ పనులను పరిశీలించడానికి సోమవారం పోలవరం విచ్చేసిన నారా చంద్రబాబు నాయుడును రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, మఠం భాస్కర్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి దంపతులిద్దరూ ఆయన కాళ్లకు నమస్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ పోలవరం నిర్మాణం కోసం త్యాగాలు చేసిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, వారికి పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పునరావాస కాలనీలు నిర్మించాలని, బాధితుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు.

హోం మంత్రి అనితను కలిసిన ఎమ్మెల్యే

రాజవొమ్మంగి : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయ భాస్కర్ ఆదివారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి అనిత హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే శిరీషాదేవి తెలిపారు.



హోంమంత్రి అనితను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి–రాజవొమ్మంగి

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రాజవొమ్మంగి 11కేవీ ఎంహెచ్ క్యూ ఫీడర్ పరిధిలోని రాజవొమ్మంగి అప్పలరాజుపేట గ్రామాలకు మంగళవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి దివాకర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జడ్డంగి 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో దాని పరిధిలోని డి.మల్లవరం, కింద్ర, లబ్బర్తి, లాగరాయి పంచాయతీల్లోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దీనిని ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి ఐవి

కందుల శ్రీనివాసరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి–ఎటపాక

సిపిఎం నాయకులు కీర్తిశేషులు కందుల శ్రీనివాసరావు మూడో వర్ధంతి సందర్భంగా సోమవారం సిపిఎం నాయకులు మండలంలోని నందిగామలో ఆయన స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సిపిఎం నాయకులు పులుసు బాలకృష్ణ అధ్యక్షత జరిగిన సభలో పార్టీ మండల కార్యదర్శి ఐ.వి. మాట్లాడుతూ కందుల శ్రీనివాసరావు తన జీవితాంతం ప్రజల కొరకు త్యాగం చేశారన్నారు. తన ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజా సమస్యలపై పోరాడేవాడని గుర్తు చేశారు. పార్టీ ఇచ్చే పిలుపులను అందుకొని ప్రతి కార్యకర్త పని చెయ్యాలని, అదే కందుల శ్రీనివాసరావుకు మనమిచ్చే నిజమైన నివాళి అని ఐ.వి. పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పులుసు సూర్యనారాయణ, నాయకులు సోయం వీరమ్మ, సోందె రామారావు, జి.హరి, కందుల సతీష్, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో రాణిస్తున్న జోష్న సాయి

మన్యానికి పేరు తెస్తున్న కూనవరం కుసుమం

ప్రజాశక్తి–కూనవరం

భారతదేశ ప్రాచీన కళల్లో కూచిపూడికి ప్రధాన స్థానం ఉంది. ప్రస్తుతం హైటెక్ యుగంలో యువత స్పీడ్ డ్యాన్స్ వైపు పరుగులు పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఇప్పటికీ ఈ కళ గురించి చాలామందికి తెలియదు. కానీ మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన కూనవరానికి చెందిన గంజి జోష్న సాయి కూచిపూడి డ్యాన్స్ వైపు అడుగులు వేసింది. పాల్వంచకు చెందిన వరలక్ష్మి గురువు దగ్గర శిక్షణ పొందింది. శిక్షణలో రాటు తేలిన జోష్నసాయి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రదర్శనలు చేస్తూ పలువురి ప్రశంసలు పొందుతుంది. మరుగున పడుతున్న ప్రాచీన కళను నేర్చుకొని మన్యం ప్రాంతానికి మంచి పేరు తెస్తున్న గంజి జోష్న సాయిని కూనవరం మండలానికి చెందిన అధికారులు, రాజకీయ నాయకులు అభినందిస్తున్నారు. తన తల్లిదండ్రులతో పాటు గురువు వరలక్ష్మి, అమ్మమ్మ అనసూయ సహకారంతో ఈ రంగంలో రాణిస్తున్నట్లు జోష్న సాయి చెప్పారు.



హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మెడల్స్, ప్రశంసా పత్రం అందుకుంటున్న జోష్న సాయి

గిరిజనులకు తప్పని డోలి కష్టాలు


జ్వర పీడితురాలిని డోలిలో మోసుకొస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ : అల్లూరి సీతారామరాజు జిల్లాలో మారుమూల గ్రామాలైన జాకరవలస గిరిజనులకు రహదారి కష్టాలు వెంటాడుతుంది. అరకులోయ మండలం మాడగడ పంచాయతీ మారుమూల జాకరవలస పివిటీజీ గ్రామానికి చెందిన కిల్లో దానియేలు (15) కొద్దిరోజుల నుంచి మలేరియా జ్వరంతో పడుతుండటంతో సోమవారం ఉదయం జోరు వానతో గొడుగులు పట్టుకుని కుటుంబీకులు జాకరవలస నుండి వంతుమూరు వరకు సుమారు రెండు కిల్లోమీటర్ల వరకు డోలి కట్టి అక్కడి తీసుకొచ్చారు. అంబులెన్స్ రాకపోవడంతో బోడుగూడా వరకు ప్రైవేట్ ఆటోలో తీసుకొస్తుండగా బోడుగూడ గ్రామం నుంచి అంబులెన్స్‌లో అరకు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని, దీంతో డోలిమోతే గతి అవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

తొమ్మిది కిలోమీటర్లు డోలి మోతతో గర్భిణిని ఆసుపత్రికి...


వర్షంలో డోలిలో గర్భిణిని తొమ్మిది కిలోమీటర్లు మోసుకొస్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి:గర్భిణీలను డోలి కష్టాలు వెంటాడు తున్నాయి. మండలంలోని కొంపల్లి పంచాయితీ మారుమూల బూడిద గ్రామానికి చెందిన బడ్నాయిని కొత్తమ్మకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు సోమవారం డోలి సహాయంతో తొమ్మిది కిలోమీటర్ల మేర రాయపాడుకు చేర్చారు. అక్కడి నుండి అంబులెన్స్‌లో విజయ నగరం ఏరియా ప్రభుత్వకి తరలించారు. రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయక పోవడంతో ఇటు రోగులకు, గర్భిణిలకు సకాలంలో వైద్య సేవలు అందలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

1222వ రోజుకు ఉక్కు దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఐక్యంగా పోరాడి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కాకుండా పరిరక్షించుకుందామనిపోరాట కమిటీ నాయకులు, క్యూ ఎటిడి విభాగానికి చెందిన శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరం సోమవారం 1222 రోజులకు చేరుకుంది. సోమవారం దీక్షల్లో క్యూఎటిడి, ఇన్స్ట్రుమెంటేషన్, ఆర్అండ్‌డి, ఇటిఎల్, డిఎన్‌డబ్ల్యు విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత లాభాల్లో ఉన్న విశాఖఉక్కును నష్టాలలోకి నెట్టిందని, అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు.నాడు కేంద్రం కేవలం రూ. 5వేల కోట్ల పెట్టుబడి పెడితే, నేడు ఐదు లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ, మూడున్నర లక్షల కోట్ల ఆస్తులు కూడగట్టుకుని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.65 వేల కోట్లను పన్నుల రూపేణా చెల్లించిన ఏకైక భారత ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు మాత్రమేనన్నారు. అలాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రయివేటుకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, లేకుంటే సెయిల్‌లో విలీనంపై త్వరలో ప్రకటన చేయాలని కోరారు. వర్కింగ్ క్యాపిటల్; ముడిసరుకును అందజేసి, పూర్తిస్థాయి ఉత్పత్తికి వీలుగా కావలసిన ఆర్థిక వనరులను స్టీల్‌ప్లాంట్‌కు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అస్తవ్యస్తంగా మురుగుకాలువలు

- రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు
- అవస్థలు పడుతున్న డుంబ్రిగుడ ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ, అధికారులు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండల కేంద్రంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షాలు కురిసినప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారమంతా డ్రైనేజీలో కూరుకు పోయి నిల్వ ఉండిపోతుంది. దీంతో, సమీపంలోని నివాస గృహాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు సైతం ఇబ్బందులు పడక తప్పడం లేదు.

స్థానిక కేజీబీవీ పాఠశాల నుంచి మండల కేంద్రం మూడు రోడ్ల జంక్షన్ వరకు డ్రైనేజీ వరకు ప్రస్తుతం పైన రోడ్డు నిర్మించడంతో గతంలోనున్న డ్రైనేజీ కాలువలు పూర్తిగా మట్టితో కూరుకు పోయాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా డ్రైనేజీలంతా వరద నీటితో నిండిపోతున్నాయి. వీధి కాలువల గుండా వరద నీరు వెళ్లే అవకాశం లేక పోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు మెయిన్ రోడ్డు కాలువల్లో నిల్వ ఉండిపోతున్నాయి.

ఒకే చోట నిల్వ ఉండిపోతుండటంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో మలేరియాతో పాటు పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రతి ఏడాది మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఇదే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ రోడ్డు కిరువైపులా గతంలో నిర్మించిన డ్రైనేజీలు మట్టితో కూరుకు పోవడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు ఎటు వెళ్లలేక నివాస గృహాల లోపలకు చేరుతుందని స్థానికులు తెలిపారు.తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి గతంలో ఉన్న డ్రైనేజీల్లో కూరుకు పోయిన మట్టిని తొలగించి పునరుద్ధరించి వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మాడుగుల మోదకొండమ్మ జాతర

ఉత్సవాలకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు : పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల మోదకొండమ్మ జాతర మహోత్సవాన్ని ఈనెల 18న మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా ఆనవాయితీగా నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవానికి ఈసారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు.

మాడుగుల మోదకొండమ్మకు ప్రత్యేక చరిత్ర ఉంది. వందల ఏళ్ల క్రితమే మాడుగుల ప్రాంతాన్ని పాలించిన ఒడిశా రాజులు అప్పట్లోనే అమ్మవారిని భక్తిగా కొలిచే వారని చరిత్ర చెబుతోంది. మొదట కోటలో రాజులు అమ్మవారికి పూజలు నిర్వహించేవారు. ఇక్కడి నుండి ఏజెన్సీ ప్రాంతానికి ఘటాలు తీసుకుని వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ సమయంలో సంస్థానాధీశులు ఏజెన్సీ ప్రాంతానికి చేరుకుని అమ్మవారికి పూజలు నిర్వహించి తిరిగి మాడుగుల చేరుకున్నారు. తిరిగి వచ్చే సమయంలో పూజా సామాగ్రితో పాటు బంగారు చెంబు మర్చిపోయారు. ఈ విషయాన్ని గ్రహించి ఆనాటి మంత్రిని మినుములూరు ప్రాంతానికి వెళ్లి వీటిని తీసుకురమ్మని ఆదేశించారు. మంత్రి తిరిగి అక్కడికి చేరుకున్న సమయంలో బంగారుచెంబు విషయమై చెప్పేసరికి అమ్మవారు ఆగ్రహంతో ఆ చెంబు తన్నగా ప్రస్తుత మాడుగుల్లో ఉన్న దేవాలయం వద్ద పడిందని దీంతో రాజులు చిన్నపాటి గుడిని నిర్మించారని పూర్వీకుల కథనం.

కొన్నేళ్ల క్రితం మాడుగుల తహశీల్దారుగా పని చేసిన అప్పన్న ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. పురాతనమైన చిన్న దేవాలయం స్థానంలో అతిపెద్ద దేవాలయం నిర్మించడానికి గ్రామస్తుల సహకారం తీసుకున్నారు. అప్పట్లో వ్యాపారుల విరాళాలతో అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టారు. చోడవరం కు చెందిన శిల్పి ఎల్లయ్య అమ్మవారి విగ్రహాన్ని ఎంతో ఆకర్షణీయంగా రూపొందించారు.

శతకం పట్టు వద్ద ఏర్పాట్లు :

అమ్మవారి పండుగకు నెల రోజుల ముందు ఆలయం వద్ద నుండి అమ్మవారి పాదాలు, ఘటాలు ఊరేగింపుగా తీసుకొని రాజు గారి కోట ఆవరణలో ఉన్న శతకం పట్టు వద్ద కొలువు ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు అమ్మవారు కొలువు పూర్తి అయిన తర్వాత తిరిగి గ్రామ పురవీధులలో మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్లి పాదాలు ఘటాలు ఆలయం వద్ద ఉంచుతారు దీంతో పండగ పూర్వవుతుంది.

ఘనంగా అమ్మవారి సారె ఊరేగింపు:

మోదకొండమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో పలు వీధులకు చెందిన భక్తులు అమ్మవారి సారెను ఘనంగా ఊరేగించారు. గవర వీధి, కొత్తూరు తోట వీధి, జగన్న చావిడి, రాజ వీధి, మోదమాంబ కాలనీ చెందిన భక్తులు అమ్మవారికి తీర్ధ ప్రసాదాలు, ఘటాలతో భారీగా ఊరేగించారు.

భక్తులకు పలు సేవా కార్యక్రమాలు:-

మోదకొండమ్మ జాతరకు వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో సేవా సంస్థల సహకారంతో చలివేంద్రాల ఏర్పాటు, ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ చేస్తారు. శ్రీరామ మెడికల్ షాప్ వద్ద శ్రీనాథ్ రామమూర్తి ఆధ్వర్యంలో గ్లూకోజ్ వాటర్, కొట్నాడ రమేష్ అరుణ, కొట్యాడ కుటుంబం ఆధ్వర్యంలో ప్రసాదం, మజ్జిగ, గండి జోగినాయుడు ఆధ్వర్యంలో రెండు రోజులు కూలింగ్ మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు :

పండగ సందర్భంగా ఈ ఏడాది భారీ ఎత్తున సాంస్కృతిక వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సుమారు పది రోజుల ముందు నుండే ప్రారంభమైన వినోద కార్యక్రమాల్లో భాగంగా జబర్దస్త్ ఫేమ్, రేలారే రేలారే, సాంఘిక, పౌరాణిక నాటకాలు, విచిత్ర భజనలు, నేల వేషాలు, ఘుంగురూ హనుమాన్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.విద్యుత్ అలంకరణ అమ్మవారి పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'కు ఘనస్వాగతం


ప్రజలకు అభివాదం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన తర్వాత గాజువాక నియోజవర్గానికి సోమవారం రాత్రి విచ్చేసిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఘనస్వాగతం లభించింది. సాయంత్రం ఆరుగంటలకు విశాఖ విమానాశ్రయంలో దిగిన పల్లాకు గాజువాకతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన టిడిపి, కూటమి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ పూలదండలతో విశాఖ విమానాశ్రయంలో స్వాగతించి, సత్కరించారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్ జీపులో గాజువాక వరకు వచ్చిన పల్లాకు దారిపొడుగునా ఎయిర్‌పోర్ట్ నుంచి షీలా నగర్, అక్కిరెడ్డిపాలెం, బిహెచ్‌పివి, ఆటోనగర్, పాత గాజువాక జంక్షన్ వరకు ప్రతిజంక్షన్లోనూ అభిమానులు, నాయకులు బారులుదీరి నినాదాలు చేస్తూ ఘనంగా స్వాగతించారు.

మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు.భారీ ఎత్తున పల్లాకు స్వాగతించేందుకు వచ్చిన కూటమి శ్రేణులు, అభిమానులు, ప్రజలను నియంత్రించడానికి పోలీసులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. యువకుల, అభిమానులు, టిడిపి శ్రేణులు పల్లాతో కరచాలనానికి ఎగబడ్డారు. తర్వాత వాత గాజువాకలోని కుంచుమాంబ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. పల్లాను కలిసేందుకు, స్వాగతించేందుకు వచ్చిన నేతలు, కార్యకర్తలు, అభిమానులతో గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిలబడడానికి కూడా స్థలం లేనంతగా కిక్కిరిసిపోయింది.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

హోంమంత్రి అనితకు తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ వినతి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: వైసిపి పాలనలో బాధ్యతలను మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. సోమవారం సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా వైసిపి నాయకులకు కొంతమంది పోలీసు అధికారులు తొత్తులుగా వ్యవరించారన్నారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పోరాటం చేసిన తనపై అప్పట్లో మంత్రిగా ఉన్న గుడివాడ అమర్ అనుచరులు ఫోన్ చేసి దుర్భాషలాడి, చంపుతామని బెదిరించారన్నారు.

మరోవైపు తాను ఇంట్లో లేని సమయంలో పోలీసులు వచ్చి తన తండ్రిని బెదిరించడంతో ఆసుపత్రి పాలయ్యారన్నారు. తన కారును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. ఇలా వరుసగా జరిగిన ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని, చివరకు అప్పటి హోంమంత్రి సుచరితకు ఫిర్యాదు చేస్తే, నిందితులపై అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ లిఖితపూర్వకంగా విశాఖ పోలీస్ కమిషనర్‌కు ఆదేశించినా, పోలీసుల నుంచి కనీస స్పందన కరువైందని వాపోయారు. అనేకసార్లు సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. వైసిపి హయాంలో అధికారులు ముఖ్యంగా పోలీసులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై తక్షణమే దర్యాప్తు చేయించి దోషులపైనా, బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని హోంమంత్రిని కోరారు. హోంమంత్రిని కలిసిన వారిలో 14వ వార్డు టిడిపి అధ్యక్షుడు పివి.వసంతరావు, పి.జగదీష్ బాబు, బొడ్డేపూడి దొరబాబు ఉన్నారు.


రమేష్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

మన్యం కవి నూనె రమేష్‌కు సత్కారం

ప్రజాశక్తి-విఆర్.పురం : మన్యం కవి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నూనె రమేష్‌ను శ్రీశ్రీ కళావేదిక తిరుపతి శాఖ ఆధ్వర్యంలో తిరుపతి యస్వి యూనివర్సిటీలో ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఉషారాణి నేతృత్వంలో జరిగిన 135 జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో నూనె రమేష్ 'కవిత కాలక్షేపమా!?' అనే కవితా గానం చేశారు. దీనికి సభికుల హర్షధ్వానాలు, నిర్వాహకుల ప్రశంసలు లభించాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 150 మందికి పైగా కవులు పాల్గొని కవితా గానం చేశారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ సమన్వయ కర్తకొల్లి రామావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టె లలిత తదితరులు నూనె రమేష్‌కు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. మారుమూల ప్రాంతం విఆర్‌జపురం మండలం రేఖపల్లి గ్రామంలో పుట్టి సాహిత్యంలో అంచలంచెలుగా ఎదుగుతున్న నూనె రమేష్ పొందిన ఈ సత్కారానికి మండల పెద్దలు గ్రామస్తులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు. మరెన్నో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అభిలాశించారు. తమ కుమారుడు సాహితీ రంగంలో ముందుకు వెళ్తున్నందుకు తల్లిదండ్రులు నూనె అజరయ్య శాంతి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

ప్రజాశక్తి - సింహాచలం, గోపాలపట్నం విలేకరులు

సింహాచలం దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పంచ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సింహాద్రి అప్పన్నను సోమవారం ఆమె దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదర స్వాగతం పలికారు. అనిత ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేసి, స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు, అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆమెను ఆశీర్వదించారు. ఇఒ ఆమెకు శాలువతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. దర్శనం అనంతరం అనిత స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంత్రిగా స్వామివారిని దర్శనానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఆలయ పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు ఎంతో అదృష్టవంతులని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో దాడులు జరిగితే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని తెలిపారు. దీంతో భయం లేకుండా విచ్చలవిడిగా మహిళలపై దాడులు జరిగాయని అన్నారు. పోలీసులు ఇప్పటికైనా ప్రజల కోసం పనిచేయాలని అన్నారు. గతంలో జరిగిన ప్రతి సంఘటనపై చర్యలు తీసుకుంటామని, మహిళలకు అన్యాయం జరగకుండా అండగా ఉంటామని అన్నారు. ఆమె వెంట కుటుంబ సభ్యులతో పాటు స్థానిక టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు.

కోండ్రు మురళికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ జిల్లా కలెక్టరేట్ : ఉత్తరాంధ్రకు చెందిన దళిత ఎమ్మెల్యే కోండ్రు మురళికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని విద్యార్థి, నిరుద్యోగ యువజన జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సిర్ల శ్యాంసుందరరావు డిమాండ్ చేశారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో 27 మంది ఎస్సీ ఎమ్మెల్యేలను గెలిపించి టిడిపికి ఇస్తే, పార్టీ అధినేత, సిఎం చంద్రబాబు నాయుడు కేవలం ఇద్దరినే మంత్రులుగా చేశారని అన్నారు. రాజ్యాంగ ఫలాలు అగ్రకుల నేతల బంధువులు, పెత్తందారులు మాత్రమే అనుభవిస్తుంటే సామాజిక న్యాయం ఎలా చేకూరుతుందని ప్రశ్నించారు.

'రుషికొండ' చుట్టూ సర్వత్రా చర్చ

నాడూ, నేడూ వివాదాలకు నిలయంగా భవంతులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో


రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన భవనం

జగన్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం జరిగిన రుషికొండ భవనాలపై తాజాగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి నేతలు ఈ 'కొండ'పై అనుమానాలు, పలు ప్రశ్నలు కురిపిస్తుండడంతో మళ్లీ వార్తల్లోకి రుషికొండ చేరింది. ఈ చర్చ రాష్ట్రానికే పరిమితం కాలేదు. దేశం, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఇదొక చర్చనీయాంశంగా మారిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. గతంలో దీని నిర్మాణం అంతా రహస్యంగా సాగడంతో చర్చకు ఆస్కారమిచ్చింది. ఇంతటి విలాసవంతమైన భవనాలను ఎలా వినియోగించాలి ? అసలేం చేయాలి ? అన్నదానిపై తాజాగా చర్చ నడుస్తోంది. పచ్చని కొండపై పర్యావరణ విధ్వంసం జరిగిందని, ఈ భవనాలను ఏం చేయాలన్నది ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారిందని ఆదివారం మీడియాతో మాజీ మంత్రి, టిడిపి ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపిన విషయం తెలిసిందే. కూటమి అధినేతల పర్యటనల తర్వాతే దీనిపై నిర్ణయం అని ఆయన చెప్పుకొచ్చారు.

వివాదం అవుతున్న కొండ

ఎవరి అనుమతితో రూ.500 కోట్ల ఖర్చు అంటూ టిడిపి తన అధికారిక ఎక్స్ ఖాతాలో సోమవారం పోస్టును షేర్ చేసింది. 'జగన్ పేలస్‌ను కట్టించాడు. లోతైన దర్యాప్తు జరగాలి' అంటూ టిడిపి పేర్కొనడం తెలిసిందే. అత్యంత హంగులతో విలాసవంతంగా 91 ఎకరాల రుషికొండపై 9.8 ఎకరాల్లో 7 బ్లాక్‌లను గత ప్రభుత్వం సుమారుగా రూ.500 కోట్లు వెచ్చించి నిర్మించింది. కొండ దిగువ నుంచి పైకి వెళ్లేటప్పుడు ఈ ఏడు సూపర్ స్ట్రక్చర్స్ వరుసగా వంకరగా కొండ చుట్టూ ఆహ్లాదపరుస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీని నిర్మాణం సందర్భంలో జగన్ సర్కారు 20 అడుగుల ఎత్తులో ప్రహరీ నిర్మించి ఎవ్వరినీ అటు వెళ్లనియ్యకుండా రహస్యం పాటించినందున అందరి దృష్టీ అప్పుడు, ఇప్పుడూ దీనిపై పడుతోంది.

7 సూపర్ స్ట్రక్చర్స్ ఏమిటి ?

విజయనగర్ బ్లాక్, కళింగ, చోళ, పల్లవ, గజపతి, వేంగి, తూర్పు కనుమలు (గంగా) అనే పేర్లతో రుషికొండపై బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. ఈ మొత్తం భవంతుల సముదాయాన్ని ఎపిటిడిసి చేపట్టింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కట్టడాలుగా ఈ భవంతులను పలువురు అభివర్ణిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి సెమినార్లు, అంతర్జాతీయ వేదికలకు సైతం ఉపయోగించుకునేలా నిర్మాణం చేపట్టారు. జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల విధానంలో విశాఖే పరిపాలనా రాజధాని అని ప్రకటన చేశాక ఈ భవనాలను త్వరితగతిన నిర్మించిన సంగతి తెలిసిందే. దీన్ని కూటమి పార్టీలు జగన్ పేలస్ అంటూ పేర్కొంటున్నాయి. ఏదిఏమైనా భవనాల నిర్మాణాలు జరిగిపోయాయి కాబట్టి మంచికి ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు.

విశాఖ పోర్టుకు రెండు అంతర్జాతీయ ర్యాంకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోర్టు తాజాగా రెండు అంతర్జాతీయ ర్యాంకులు సాధించింది. ప్రపంచ బ్యాంకు నిర్వహించిన కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో 20వ స్థానంలోనూ, కంటైనర్ టెర్మినల్ పనితీరు సూచికలో 19వ స్థానంలో నిలిచి తన ప్రతిష్టను మరోమారు చాటిచెప్పింది. ఈ విజయం విశాఖపట్నం పోర్టు పనితీరును, ప్రపంచ వాణిజ్యంలో పోర్టు ప్రాముఖ్యతను తెలుపుతోందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ సోమవారం తెలిపారు. కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో తనకున్న విశేష అవకాశాలను అందిపుచ్చుకుని 2022లో ఉన్న 122వ స్థానం నుంచి ఏకంగా 102 స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి విశాఖ పోర్టు చేరుకుంది. 'పెరిగిన ర్యాంకింగ్ స్థానికంగానూ, అంతర్జాతీయంగానూ వాణిజ్య వృద్ధిలోనూ, వ్యాపార అవకాశాలను కల్పించడంలోనూ దోహదపడుతుంది. పోర్టులో పెరిగిన పని సామర్థ్యం కారణంగా సరుకు రవాణాలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేయడమే కాకుండా వ్యాపార అవకాశాలను పెంపొందించి దేశ వాణిజ్యాభివృద్ధిలో తనదైన ముద్రను వేయనుంది' అని వేణుగోపాల్ వెల్లడించారు. ఈ ఘనతను సాధించడం పట్ల పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు స్పందిస్తూ పోర్టు సాధించిన ఘనత పట్ల గర్వంగా ఉందని తెలిపారు. సిబ్బంది అంకితభావం, కష్టించేతత్వం వల్లనే ఇవి సాధ్యమయ్యాయన్నారు. ప్రపంచ పటంలో విశాఖ పోర్టును ఉన్నతంగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు 10 లక్షల మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని విధించుకున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు సెమ్స్, ఐఎంయు ద్వారా పోర్టు ఉద్యోగులకు, స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తున్నట్లు ఆయన మీడియాకు వెల్లడించారు.

ఆటో యూనియన్ నేత కర్రి అప్పలరాజు మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎం సభ్యులు, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి అప్పలరాజు (54) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. జగదాంబ ఏరియా 31వ వార్డు కృష్ణా గార్డెన్‌లో ఆయన నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమారుడు లెనిన్, కుమార్తె సాహితి ఉన్నారు. 25 ఏళ్లుగా పార్టీ సభ్యునిగా సిపిఎం అభివృద్ధికి కృషి చేశారు. డివైఎఫ్ఐలో పనిచేస్తూ యువకులను పార్టీలోకి తీసుకొచ్చారు.


దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

జావిద్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామంలో ఆదివారం ఈదురుగాలులకు చెట్టు కూలి మాచర్ల జావిద్ ఇంటిపై పడడంతో ఆ ఇంటి పైకప్పు సిమెంట్ రేకులు పూర్తి శిథిలమయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం నాయకులు సోమవారం ఆ ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మాచర్ల జావిద్ ఇంటిపై గాలివానకి చింత చెట్టు పడటం వలన సిమెంట్ రేకులు పగిలిపోయాయని తెలిపారు. ఆ సమయంలో జావిద్ కుటుంబం ఉపాధి కోసం వేరే ఊరు వెళ్ళటం వలన ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. ఇంటి పైకప్పు రేకులు పగిలిపోయాయని, అధికారులు స్పందించి ఆ కుటుంబానికి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం, చిన్నబాబు, నాయకులు పంకు, సత్తిబాబు, కె.సత్యనారాయణ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సీలేరులో దొంగలు హల్‌చల్

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. సీలేరు ఆరో క్రాస్ రోడ్‌లో ఆర్ఎంపి డాక్టర్ సైదా నివాసముంటున్నారు. ఆదివారం దొంగలు సైదా ఇంటి బయట గేటు తీసి ఆయన ద్విచక్ర వాహనాన్ని దొంగలించడానికి హ్యాండ్ లాక్ ఊడదీస్తుండగా బైకుకు ఉన్న అలారం మోగింది. దీంతో డాక్టర్ సైదా అప్రమత్తమై లేచి బయటకు రావడంతో దొంగలు అక్కడ నుండి పరుగులు తీశారు. అలాగే సీలేరులో టిడిపి నాయకుడు ఎన్.తిరుమలరావు బైక్‌లో ఆదివారం రాత్రి పెట్రోలు అపహరించుకుపోయారు. ఇటీవల కాలంలో సీలేరులో అగంతకులు బైకులు చోరీలకు పాల్పడుతున్నారు. మార్కెట్ సెంటర్‌లో చిన్ని మెకానిక్ కుమారుడిది పల్సర్ బైక్, సెక్యూరిటీ హెూంగార్డుది మరో బైకు ఇటీవల దొంగలు అపహరించుకుపోయారు. ఇంటి ముంగిట్లో బైక్‌లు పెడితే చిల్లర దొంగలు రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా పెట్రోలు తస్కరిస్తున్నారు. సీలేరు దొంగలు బైకులు, పెట్రోలు దొంగతనాలకు పాల్పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దోపిడీ దొంగలపై ఇప్పటికైనా స్థానిక ఎస్సై రామకృష్ణ దృష్టి సారించి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదంలో పూరి గుడిసె దగ్ధం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరి గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రంపచోడవరం ఎస్‌టి కాలనీకి చెందిన శ్రీనివాసరెడ్డి నివాసముంటున్న పూరి గుడిసెలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పిడుగు బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఏడుగురురాళ్లపల్లి గ్రామ పంచాయతీ కాటుకపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగుపాటు ఇల్లు దగ్ధమై కట్టుబట్టలతో రోడ్డు పడ్డ సోడి నాంచారమ్మ కుటుంబానికి టిడిపి మండల నాయకులు సహాయం అందించారు. రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, యూత్ ప్రధాన కార్యదర్శి శీలం తమ్మయ్య, మండల కార్యదర్శి ముత్యాల శ్రీరామ్ తదితరులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ తరుపున నిత్యవసర సరుకులు, బట్టలు అందజేశారు.